క్లుప్తంగా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజాం : పట్టణంలోని హరిజనవీధిలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నామని కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆ వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మున్సిపల్ ఉద్యోగులు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

నేడు మండల సమావేశం

రేగిడి : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం జరగనుందని ఎంపీడీఓ నాగమణి గురువారం తెలిపారు. ఎంపీపీ దార అప్పల నరసమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయంతోనే సురక్షితమైన, నాణ్యమైన దిగుబడులు సాధ్యమని వక్తలు అన్నారు. మండలంలోని భోజరాజపురంలో రైతులు గురువారం సామూహిక విత్తనశుద్ధి చేశారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వాండ్రాసి లక్ష్మి, జి. వరప్రసాద్, కె. శంకరరావు, పి. వెంకటరమణ, జి. మోహన్, తదితరులు రైతులకు వివరించారు.

మర్యాదపూర్వక కలయిక



ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఏఈ శశిభూషణరావు

రామభద్రపురం: మండల విద్యుత్ శాఖ ఏఈగా పోల శశిభూషణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో కలిసి ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు శశిభూషణరావు బొబ్బిలి సబ్‌స్టేషన్‌లో సాంకేతిక ఏఈగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు.

ఆస్పత్రికి పోటెత్తిన రోగులు



ఆస్పత్రిలో రోగులు

బాడంగి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి గురువారం రోగులు పోటెత్తారు. జ్వరం, విరోచనాలతో ఎక్కువ మంది బాధపడుతూ, ఆస్పత్రికి రాగా డాక్టర్ కాశీవిశ్వనాథం, తదితరులు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కొంతమందిని ఇన్‌పేషంట్లుగా ఆస్పత్రిలో చేర్చుకుని, వైద్యం అందిస్తున్నారు.

హర్షం

రాజాం : సంస్కృతాంధ్ర పండితుడు, కవి, రచయిత బేతవోలు రామబ్రహ్మంకు సాహిత్య అకాడమీ రెండేళ్లకు ఒకసారి ఇచ్చే భాషా సమ్మాన్ పురస్కారం ఇవ్వడం ఆనందంగా ఉందని రాజాం రచయితల వేదిక హర్షం ప్రకటించింది. రారవే అధ్యక్షులు గార రంగనాథం విశాఖలో రామబ్రహ్మంకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామబ్రహ్మం కవిత్వం, ప్రబంధం, నాటకాలు, అనువాదాలు ఇలా 34కి పైగా పుస్తకాలు రచించారని తెలిపారు.

స్వర్ణాలంకరణలో జగన్నాథుడు



స్వర్ణాలంకరణలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లోని సత్యసాయి శివం మందిరంలో ఏర్పాటు చేసిన జగన్నాథస్వామి స్వర్ణాలంకరణలతో భక్తులకు గురువారం దర్శనమిచ్చాడు. తొమ్మిది రోజులుగా జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలను అత్యంత వైభవంగా చేపట్టారు. స్వర్ణాలంకరణలో దర్శనమిచ్చిన స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చక చకా.. కొత్త ఊళ్లు...



రేగిడి మండలం కాగితాపల్లి వద్ద జగనన్న కాలనీ



కంచరాం జగనన్న కాలనీలో నిర్మాణాలు



రాజాంలో జగనన్న కాలనీకి నిర్మించిన రోడ్డు

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాజాం పట్టణంలో కంచరాం, కంచరాం 1, 2 పేరుతో మూడు చోట్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మొత్తం 1038 మందికి ఇళ్ల స్థలాలు, నిర్మాణ బిల్లులు మంజూరు చేశారు. 923 మంది పనులు ప్రారంభించగా.. 78 మంది ఇళ్లు పూర్తి చేశారు. 376 ఇళ్లు నిర్మాణంలో చివర దశలో ఉన్నాయి. రాజాం మండలంలో 23 జగనన్న కాలనీల్లో నిర్మాణాలు జరుగుతుండగా 341 మందికి పట్టాలు అందించారు. అన్ని ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. రేగిడి మండలంలో 19 జగనన్న కాలనీల్లో 393 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. 117 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. సంతకవిటి మండలంలో 18 చోట్ల లేఅవుట్లు వేయగా 103 మందికి పట్టాలు అందజేశారు. 36 ఇళ్లు పూర్తవగా, 67 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వంగర మండలంలో అరసాడ వద్ద 24 ఇళ్లతో కాలనీ నిర్మిస్తున్నారు. ఈ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

– రాజాం/రేగిడి

భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

● ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించినందున ఆయా ఏజెన్సీలు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీలు, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిర్మాణాలు ఎవరు చేపడితే వారి వ్యక్తిగత ఖాతాలకు బిల్లులు జమయ్యేలా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. నిర్మాణ పనులు సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేస్తే ఆ వెంటనే నెల రోజుల్లో బిల్లులు మంజూరవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, తెర్లాం ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, బొబ్బిలి ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు, పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు, ఏఈలు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



సంకిలిలో వరి విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రేగిడి : మండలంలోని సంకిలి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ విత్తనాలు గురువారం పంపిణీ చేశారు. రైతులకు అవసరమైన అన్ని రకాల వరి విత్తనాలను పూర్తి స్థాయిలో అందజేస్తున్నామన్నారు. విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రైవేటు దుకాణాల్లో వరి విత్తనాలను కొనవద్దని సూచించారు. ఏ విత్తనం కావాలన్నా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి సంధ్యా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపురెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ



వస్త్రదానం చేస్తున్న సోరు సాంబయ్య, తదితరులు

బొబ్బిలి: సహకార రంగ పితామహుడు, రిజర్వేషన్లకు ఆద్యుడు ఛత్రపతి సాహూజీ మహారాజ్ జయంతి సందర్భంగా గురువారం నిరుపేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ సోరు సాంబయ్య మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన మూక్‌నాయక్ పత్రిక కొనసాగేందుకు ఆ రోజుల్లోనే ఆర్థిక సహాయం చేసిన సాహూజీ మహారాజ్ అభినందనీయుడని కొనియాడారు.

మురుగుపోయే మార్గం చూపరూ..



కూరాకులవీధిలో ఇళ్ల ముందు నిల్వ ఉన్న మురుగునీటిని చూపిస్తున్న స్థానికులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని రామభద్రపురం మేజర్ పంచాయతీ పరిధి పెద పొందూరు వీధి, చేపలమార్కెట్ వద్దనున్న కూరాకుల వీధుల్లో ఇళ్ల ముందే మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆయా ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగుపోయే మార్గం చూపించాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ ఈఓ సుప్రియ వివరణ కోరగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి..



మాట్లాడుతున్న రవికుమార్, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని పలు కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని, వసతిగృహాల అనుమతులు లేకున్నా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి. రవికుమార్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కొన్ని కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫారాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలిరాజు, జోసెఫ్, నాగరాజు, మణి తదితరులున్నారు.

వేతనదారులకు వంద రోజుల పని



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం : ఉపాధి వేతనదారులకు వంద రోజులు తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో గురువారం సమీక్షించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులు వివరాలు తెలుసుకోవడంతో పాటు వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న కుటుంబాల వివరాలు సేకరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని పూర్తి చేసే వరకూ పనులు కల్పిస్తూ ఉండాలని తెలిపారు. వ్యవసాయ పనులు, ఇతర పనులు ప్రారంభమై వేతనదారులు ఉపాధి పనికి రాని సమయంలో మాత్రమే పనులు నిలుపుదల చేయాలని సూచించారు. ఏపీఓ శ్రీనివాసరావు, ఈసీలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

చేపల వేటపై అవగాహన



చేపల చెరువుల వద్ద మత్స్యకారులకు శిక్షణ

రేగిడి : మత్స్యకారులకు క్షేత్ర స్థాయిలో చేపల పట్టే విధానంపై జిల్లా ఫిషరీస్ ఏఐఎఫ్ఓ జి.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీవీ ప్రసాదరావు శిక్షణ ఇచ్చారు. మండలంలోని ఆమదాలవలస పరిసరాల్లో ఉన్న సాగునీటి చెరువులు, ఆక్వా చెరువులు వద్దకు మత్స్యకారులకు గురువారం తీసుకెళ్లి చేపల పెంపకంతో పాటు వాటిని వేట చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్ఎఫ్‌డీబీ ఆధ్వర్యంలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మేత యాజమాన్యం, ఆరోగ్య యాజమాన్యం, నీటి యాజమాన్యాల నిర్వహణపై అవగాహన కల్పించినట్టు అధికారులు తెలిపారు. వీఎఫ్ఏ పాండ్రంకి శారద, రౌతు శ్రీనివాసరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి



పాగిరిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం సిటీ: జగనన్న సురక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వే సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండల పరిధి పాగిరి గ్రామంలో సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ప్రతి గృహంలోని లబ్ధిదారులను పక్కాగా గుర్తించి అర్హత నిర్ధారించాలని సూచించారు. సర్వేలో అలసత్వం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శి జి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



తెర్లాంలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న మహిళా పోలీస్ రమాదేవి, వలంటీర్ గౌరీశ్వరి

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాం, చీకటిపేట, తదితర గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే చురుగ్గా జరుగుతోంది. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశాల మేరకు ఆయా గ్రామ సచివాలయాల్లోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గురువారం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, లేదా.. అర్హత ఉండి ఏదైనా పథకం వర్తించడం లేదా అని అడిగి తెలుసుకుంటున్నారు. అలాగే విద్యార్థులు, రైతులు, ప్రజలకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసులను చదివి వినిపించి వాటిలో ఏమైనా ధ్రువపత్రాలు కావాలా అని వలంటీర్లు అడిగి తెలుసుకుంటున్నారు. అవసరమైన వారికి జూలై ఒకటో తేదీన సర్టిఫికెట్లు అందజేస్తారు.

ఘనంగా ఆషాఢ ఏకాదశి



కంచరవీధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



గొర్లె సీతారాంపురంలో పూజలందుకుంటున్న స్వామివారు

బొబ్బిలి: ఆషాఢ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కంచరవీధి వేంకటేశ్వరాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని గొర్లె సీతారామపురంలోని కల్యాణ వేంకటేశ్వరాలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

తాగునీటి కోసం చర్యలు

రాజాం సిటీ: మండల పరిధి నందబలగ పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు తెలిపారు. గ్రామంలో మూడు బోర్లు మరమ్మతులకు గురవడంతో గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో గురువారం గ్రామంలోని మరమ్మతులకు గురైన మూడు బోర్లను మెకానిక్‌లచే బాగు చేయించారు.

వైఎస్సార్‌సీపీ నేత ఔదార్యం



శ్మశాన వాటికు చదును చేయిస్తున్న సత్యంనాయుడు

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత బెవర సత్యంనాయుడు తమ ఔదార్యాన్ని చాటుకున్నాడు. దశాబ్దాల నుంచి ఆక్రమణలతో పాటు జంగిల్‌తో పూడుకుపోయిన శ్మశాన వాటిక స్థలాన్ని తన సొంత డబ్బులతో గురువారం చదును చేయించారు.

బక్రీద్ ప్రార్థనలు



బొబ్బిలి: ముస్లింల ప్రార్థనలు

బొబ్బిలి: బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు వాడవాడలా గురువారం ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల దయ, త్యాగనిరతితో మెలగాలని పెద్దలు హితబోధ చేశారు. అనంతరం ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం



సత్యనారాయణ



శ్రీనివాసరావు



రమేష్‌నాయుడు



మరిశర్ల విజయలక్ష్మి



రామచంద్రినాయుడు



ఈశ్వరరావు(విసు)



దామోధరరావు



శంకరరావు



సింహాచలంనాయుడు



సత్యనారాయణ

రాజాం : జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను వైఎస్సార్‌సీపీ నియమించింది. మండలాల వారీగా వీరిని నియమిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని ఆదేశించింది. రాజాం మున్సిపాలిటీ జేసీఎస్ ఇన్‌చార్జిగా కొయ్యాన సత్యనారాయణ, రాజాం మండలానికి కామోదుల శ్రీనివాసరావు, సంతకవిటికి రాగోలు రమేష్‌నాయుడు, వంగరకు మరిశర్ల విజయలక్ష్మి, రేగిడికి పాలవలస రామచంద్రినాయుడు నియమితులయ్యారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించి జేసీఎస్ పట్టణ, మండల ఇన్‌చార్జ్‌లను అధికారికంగా నియమిస్తూ తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గ కేంద్రమైన బొబ్బిలి పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా రేజేటి ఈశ్వరరావు(విసు)ను నియమించారు. అలాగే బొబ్బిలి మండలానికి తమ్మిరెడ్డి దామోధరరావును, తెర్లాం మండలానికి చేపేన సత్యనారాయణను, రామభద్రపురం మండలానికి చింతల సింహాచలంనాయుడును, బాడంగి మండలానికి మరిపి శంకరరావును నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పల నాయుడు, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ ఇన్‌చార్జ్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

పల్లె గూటికి ప్రభుత్వ భవనాలు..



రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రైతుభరోసా కేంద్రం



పనులు జరుగుతున్న హెల్త్/వెల్‌నెస్ సెంటర్ భవనం

ప్రభుత్వ కార్యాలయాలు.. వాటికి సొంత భవనాలు.. పట్టణాల్లోనే ఉంటాయనేది ఒకప్పటి మాట. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి మారింది. ప్రజల వద్దకే పాలన అనే లక్ష్యంతో పాలనా పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గ్రామాలకే ప్రభుత్వ కార్యాలయాలను తరలించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్లు, తదితర కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటికి సొంత భవనాలు సైతం ఏర్పాటు చేశారు. మండలంలోని పణుకువలసలో రూ. 79 లక్షలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిర్మిస్తున్నారు. మండల ఇంజినీరింగ్ అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్ పర్యవేక్షణలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో భవనాలు ప్రారంభిస్తామని సర్పంచ్ చందక సత్యనారాయణ తెలిపారు. – తెర్లాం

హిందీ పరీక్షల ఫీజు గడువు పెంపు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ(చెన్నై)వారి హిందీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు జూలై 15 వరకూ గడువు ఉందని హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావు గురువారం తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ వరకూ పరీక్షలు సెప్టెంబర్‌లో జరుగుతాయని తెలిపారు. వివరాలకు 9949917365 ను సంప్రదించాలని సూచించారు.